క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: అమలాపురం కోర్టుల సముదాయంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. సాయి విశ్వాస్ ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు. జిల్లా కోర్టు రెండో అదనపు న్యాయమూర్తి వి.నరేష్‌తో పాటు కోర్టుల సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సాయి విశ్వాస్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ హిమాని, డాక్టర్ అసాద్ శిబిరంలో వైద్య సేవలందించి కోర్టు సిబ్బందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఇచ్చారు.

నేడు సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

ఐ.పోలవరం: మండలంలోని పశువులంక గ్రామంలో కొలువైన సంతోషిమాత ఆలయంలో ఆదివారం ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు పెట్టా నాగ వీర వెంకట సత్యనారాయణ, మీనా దుర్గ దంపతులు నూతన సువర్ణ కిరీటాన్ని అమ్మవారికి అలంకరించనున్నారు. అలంకరణ అనంతరం గణపతి హోమం నిర్వహించనున్నారు. పూజా కార్యక్రమాలను నాగభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో చేయనున్నారు. ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న మహా సౌరయాగం

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో ఉన్న రామ మందిరంలో ప్రధాన అర్చకులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌర యాగంలో భాగంగా జరుగుతున్న పూజల్లో శనివారం సర్పంచ్ ఊర్మిళాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు సౌరయాగం విశిష్టతను ఆమెకు వివరించి వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

లక్ష్మీ గణపతికి వార్షికోత్సవ పూజలు



గణపతిని ఉండ్రాళ్లు, పండ్లతో అభిషేకిస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో వేంచేసి యున్న లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మీ గణపతికి ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రత్యేక పూజలు, అభిషేకాలను అర్చక స్వాములు నిర్వహించారు. అర్చకులు నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు,అభిషేకాలను వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీ గణపతి స్వామికి ఉండ్రాళ్లు, పలు రకాల పండ్లతో అభిషేకించారు.

సర్పంచ్ ఔదార్యం

తాళ్లరేవు: తలదాచుకునేందుకు కనీసం ఇల్లు కూడా లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ కుటుంబానికి ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. గ్రామానికి చెందిన కొరిపల్లి బాబీ కుటుంబం ఇల్లు లేకపోవడంతో రేకుల షెడ్ వేసుకునేందుకు ప్రసాద్ దంపతులు రూ.5 వేలు అందజేశారు. సర్పంచ్ దంపతులను పలువురు అభినందించారు.

ఘనంగా కాలభైరవ స్వామి తీర్థం

తాళ్లరేవు: చొల్లంగిపేట గ్రామంలో వేంచేసి యున్న కాలభైరవస్వామి తీర్థ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నిబంధనలకు లోబడి చికెన్ విక్రయాలకు అనుమతి

ముమ్మిడివరం: నిబంధనలకు లోబడి చికెన్, కోడిగుడ్ల విక్రయాలు చేయాలని కమిషనర్ పి.రవివర్మ సూచించారు. బర్డ్ ఫ్లూ ప్రబలుతున్న నేపథ్యంలో గత నాలుగు రోజులుగా నగర పంచాయతీ పరిధిలో చికెన్, కోడిగుడ్ల విక్రయాలు చేస్తున్న షాపులపై కమిషనర్ నేతృత్వంలోని నగర పంచాయతీ సిబ్బంది దాడులు చేసి విక్రయాలు నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ముమ్మిడివరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెస్టారెంట్, చికెన్ వ్యాపారులు కమిషనర్‌ను కలిసి చర్చించారు. దీంతో నిబంధనలకు లోబడి చికెన్ విక్రయాలు చేసుకోవడానికి అనుమతినిచ్చారు. పబ్లిక్ హెల్త్ అధికారులు తనిఖీలు చేసే సమయంలో నిబంధనలను ఉల్లంఘించిన వారికి రూ.25 వేలు నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్యం పదిలం

- గో ఆధారిత ఉత్పత్తుల విక్రయాలకు వినియోగదారుల ఆసక్తి
- గోమూత్రంతో తయారు చేసిన జీవామృతమే ఎరువు
- వరితో పాటు ఆకుకూరలు, కాయగూరలు, పండ్ల పెంపకం
- రసాయన ఉత్పత్తులతో ప్రజారోగ్యం గుల్ల
- ప్రజారోగ్యమే లక్ష్యంగా సాగు



తూర్పుపేటలో గో ఆధారిత వ్యవసాయ క్షేత్రం



గో ఆధారిత వస్తువుల విక్రయ స్టాల్



పి.మల్లవరం ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పండించిన బ్లాక్ రైస్

తాళ్లరేవు: మార్కెట్‌లో ఏది కొనాలన్నా ..ఏది తినాలన్నా వెన్నులో వణుకు పుడుతోంది. కారణం ఏ పంటకు ఏ రసాయనాలు వినియోగిస్తున్నారో.. ఏ పదార్థం తింటే ఏమవుతుందోనని ప్రజలు నిత్యం భయం భయంగా బతకాల్సిన దుస్థితి ఎదురవుతోంది. రోజువారీ దినచర్య ప్రారంభించే పాల దగ్గర నుంచి ప్రతి ఆహార పదార్థం కలుషితంగా మారిపోవడంతో వాటి ప్రభావం ప్రజారోగ్యంపై పడుతోంది. రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలను తినడం వల్ల అనేక మంది అనారోగ్యం బారిన పడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో రసాయనాలు వినియోగించని ఆహార పదార్థాల కోసం ప్రజలు నిత్యం అన్వేషించే రోజులు వచ్చాయి. అటువంటి వారికి గో ఆధారిత ఉత్పత్తులు వరంగా మారాయి. ఆహార ధాన్యాల నుంచి కాయగూరల వరకు, అపరాల నుంచి పండ్ల వరకూ ఒక్క రసాయనం కూడా వాడకుండా కేవలం గోమూత్రంతో తయారు చేసిన జీవామృతంతో పండించిన పంటలు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి. పర్యావరణ ప్రేమికులు, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించేవారు గో ఆధారిత వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసి పంటలను పండిస్తున్నారు. ప్రభుత్వం సహకారమందిస్తే మరింత ఉత్సాహంగా పంటలు పండిస్తామంటున్నారు.

శ్రమతో కూడుకున్నా సాగు చేస్తున్నాం..



రైతులు రసాయన సాగుకు అలవాటు పడిపోయారు. రసాయనాల వినియోగం ద్వారా పంటల దిగుబడి అధికంగా రావడంతో ఆ విధానాన్నే కొనసాగిస్తున్నారు. అయితే ఆహార పంటలలో రసాయనాల వినియోగం ద్వారా మంచి కన్నా చెడే ఎక్కువగా జరుగుతోంది. రసాయనాలు వినియోగించిన పదార్థాలను తినడం ద్వారా మధుమేహం, క్యాన్సర్, టీబీ తదితర దీర్ఘకాల వ్యాధుల బారిన పడి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయం, గో ఆధారిత పంటలను పండించడం ద్వారా ప్రజలకు మేలు కలుగుతుందన్న ఉద్దేశ్యంతో పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట గ్రామంలో గో ఆధారిత వ్యవసాయం క్షేత్రం ఏర్పాటు చేసి కాయగూరలు, పండ్లను పెంచుతున్నాం. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఈ తరహా వ్యవసాయానికి శ్రమ కాస్త అధికంగా ఉంటుంది. ఆదాయం కాస్త తక్కువ అయినప్పటికీ ప్రజల నుంచి వస్తున్న స్పందనతో సాగు చేస్తున్నాము.

పులి రాంబాబు, వ్యాస ఫామ్స్ నిర్వాహకులు, తూర్పుపేట.

జీవామృతంతో మేలు



వ్యవసాయ క్షేత్రంలో స్వయంగా లభించే నీటితో పాటు, గోమూత్రంతో తయారు చేసిన జీవామృతంతో పంట సాగు చేస్తున్నాము. విత్తనాల ఎంపిక దగ్గర నుంచి పెంపకం వరకు స్వయంగా పరిశీలిస్తూ ఎటువంటి రసాయనాలు వాడకుండా సాగు చేస్తున్నాం. నారు మొక్కలను నర్సరీలో పెంచి తరువాత విడివిడిగా మడులలో పెంచడం జరుగుతుంది. చీడపీడలకు సంబంధించి ప్రత్యేకంగా కషాయాలు తయారు చేసి వినియోగిస్తాం.

గోకేటి వెంకటలక్ష్మి, వలంటీర్, పోలేకుర్రు.

సంతృప్తిగా తింటున్నాం..



ఆహార పదార్థాలు కలుషితంగా మారిన నేటి రోజుల్లో ఎటువంటి రసాయనాలు వినియోగించని గో ఆధారిత ఉత్పత్తులను సంతృప్తిగా తినగలుగుతున్నాం. కళ్ల ముందే పండిస్తున్న టమాటా, వంగ, బీర, ఆనప, చిక్కుడు తదితర కాయగూరలతో పాటు, తోటకూర, చుక్కకూర, కరివేపాకు, కొత్తిమీర వంటి ఆకుకూరలు, క్యారెట్, ముల్లంగి, పెండలం వంటి దుంపలు, అరటి, బొప్పాయి, నిమ్మ, దానిమ్మ వంటి పండ్లను సైతం కొనుగోలు చేసి సంతృప్తిగా తింటున్నాం. ఇంచు మించు బయట మార్కెట్ ధరలతో సమానంగా విక్రయిస్తుండడంతో మాకు భారం అనిపించడం లేదు.

పెయ్యల శ్రీనివాస్, వినియోగదారుడు.

ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ వైథిలింగం

అధికారులతో సమీక్షలో ఎంపీ వైథిలింగం

యానాం: కేంద్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పుదుచ్చేరి ఎంపీ వైథిలింగం పేర్కొన్నారు. శనివారం కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యానాం నుంచి పలు సమస్యలు తన వద్దకు వస్తున్నాయని ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్ అమలు కాకపోవడం వల్ల పేదలు వైద్యం చేయించుకోలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. సమావేశంలో జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌ను పిలిచి మాట్లాడారు.ఈ పథకం ద్వారా రోగులకు వైద్యం అందించడానికి గుర్తించబడిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ఆసుపత్రులు నిరాకరిస్తున్నాయని సమాధానం చెప్పారు. దీంతో ఎంపీ వైథిలింగం పుదుచ్చేరిలో ఆయుష్మాన్ భారత్ కోఆర్డినేటర్‌తో మాట్లాడి పథకాన్ని ఎందుకు నిలుపుదల చేశారో ప్రశ్నించారు. తక్షణం యానాం వచ్చి ఆసుపత్రులను సందర్శించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, కాంగ్రెస్ ఎమ్మెల్యే వైద్యనాథన్, పిడబ్ల్యూడీ, ఆరోగ్య, విద్యుత్, వ్యవసాయ, ఫిషరీస్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిప్‌మెర్ ఆసుపత్రిని సందర్శించిన ఎంపీ వైథిలింగం

యానాంలో జిప్‌మెర్ ఆసుపత్రిని ఎంపీ వైథిలింగం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బందితో రోగులకు అందుతున్న వైద్యంపై సమీక్ష ఏర్పాటు చేసి మాట్లాడారు. త్వరగా ఇన్ పేషెంట్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా కిడ్నీ సంబంధిత రోగులు డయాలిసిస్ కోసం ఇబ్బందులు పడుతున్నారని త్వరగా డయాలిసిస్ విభాగాన్ని ఒకటి, రెండు నెలల్లో ప్రారంభించాలని ఆదేశించడంతో అధికారులు సైతం అంగీకరించారు. గర్భిణులకు గైనిక్ విభాగాన్ని ప్రారంభించాలని ఈ రెండు విభాగాలు ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిప్‌మెర్ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌రాజ్, పుదుచ్చేరి జిప్‌మెర్ నోడల్ ఆఫీసర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

తీర గ్రామాల్లో రక్షిత తాగునీరు అందించాలి



దరియాలతిప్ప గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ వైథిలింగం

యానాం: దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకం ద్వారా సుమారు 10 తీర ప్రాంత గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని అంతటి ప్రాధాన్యం గల ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీ వైథిలింగం పీడబ్ల్యూడీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. చెరువుకు సంబంధించి ఆధునీకరణ పనులు చేపట్టకపోవడం, చెరువులో పూడికతీత పనులు చేపట్టక నీరు రంగు మారడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధవళేశ్వరం నుంచి యానాం వరకు కోట్లాది రూపాయలతో పైపులైను వేసినప్పటికీ అది ప్రస్తుతం పనిచేయక పోవడంపై ఎంపీ వైథిలింగానికి స్థానికులు వివరించారు. చమురు సంస్థలైన ఓఎన్‌జీసీ, రిలయన్స్ కంపెనీలు తమ గ్రామాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని కేవలం మత్స్యకారులకే పరిహారం ఇస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కమిడి బాలయోగి, సబ్బతి శ్రీను, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి, తిరుకోటి భైరవమూర్తి తదితరులు రైతులు పాల్గొన్నారు.

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశమైన జడ్జి ప్రమీలారాణి

రాజోలు: జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి కోరారు. శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు మాట్లాడుతూ వచ్చే నెల 8వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ జరగుతుందన్నారు. రాజీ చేసుకోవడం ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని కక్షిదారులకు వివరించాలన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులకు విముక్తి లభిస్తుందన్నారు.రాజోలు సీఐ నరేష్ కుమార్, రాజోలు, నగరం, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు, రాజోలు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్, న్యాయవాదులు ఆకుల భాస్కరరావు, మెడబల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అయినవిల్లి: విలస గ్రామంలో మాగం ఒకటో నంబర్ కాలువగట్టు కొప్పిశెట్టి వారి పాలెంలో కోదండరామ స్వామి వారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో ఈ పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారిని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, అయినవిల్లి మండల జెడ్పీటీసీ సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట అంబాజీపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కుచర్లపాటి కృష్ణరాజు, విలస గ్రామ సర్పంచ్ కుసుమ లిల్లీమంగేస్కర్, విలస ఉపసర్పంచ్ వెంకటరమణ, విలస మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి సత్యనారాయణ, నాయకులు ఉన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: నర్సిపూడి పడమట వీధిలో పునః నిర్మించిన శ్రీరామాలయంలో శనివారం సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రముఖ వేద పండితులు కాశీ శేఖరబాబు ఆచార్యుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ పురోహితుల బృందం విగ్రహాలను నెలకొల్పారు, పరిసర ప్రాంతాల నుంచి అధికం సంఖ్యలో భక్తులు విచ్చేసి దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.భారీ అన్నసమారాధన జరిగింది.

పేదలకు చీరల పంపిణీ

మామిడికుదురు: నామన ఫౌండేషన్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. నామన కృష్ణవేణి స్మారకార్థం 100 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. డాక్టర్లు నామన వినోద్, నామన శృతి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నిరుపేదలకు అండగా నిలవాలన్న సంకల్పంతోనే ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ బొలిశెట్టి జయరామ్, సొసైటీ మాజీ అధ్యక్షులు బొలిశెట్టి ప్రభుదాసు, సరెళ్ల సత్యనారాయణ, కుంపట్ల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు మేము సైతం



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణాన్ని, శుభ్రం చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు, సిబ్బంది



ముమ్మిడివరంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న నగర పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది

అమలాపురం టౌన్: స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శ్రమదానంతో ఆస్పత్రి ప్రాంగణాన్ని శనివారం ఉదయం పరిశుభ్రం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది చీపుర్లు పట్టి ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం వైద్య సిబ్బంది స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

స్థానిక గడియార స్తంభం సెంటరును వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు పరిశుభ్రం చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ అంతర్జాతీయ ఏరియా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, వాకర్స్ ప్రతినిధులు డాక్టర్ వైవీ నరసింహరావు, జవ్వాది తాతబాబు తదితరులు పాల్గొన్నారు. సర్ సీవీ రామన్ స్కూలు ప్రాంగణంలో విద్యార్థులు స్వచ్ఛాంధ్రప్రదేశ్ ఆకారంలో నిలబడి పరిశుభ్రతపై నినాదాలు చేశారు. స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యానిధి స్కూలు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ ఆకుల బాపన్ననాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

స్వచ్ఛతపై మున్సిపల్ సిబ్బంది ప్రతిజ్ఞ

అమలాపురం టౌన్: స్వచ్ఛాంధ్రపై అమలాపురం మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సాయంత్రం ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ డీఈఈ సీహెచ్ నాగ సతీష్, ఏఈ వెంకటేష్, అకౌంటెంట్ రామకృష్ణతో పాటు కార్యాలయంలోని అన్ని విభాగాల సిబ్బంది, పట్టణంలోని 15 వార్డు సచివాలయాల కార్యదర్శులు ప్రతిజ్ఞ చేశారు. పశు సంవర్ధక శాఖ అమలాపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్. విజయరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో కార్యాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తొలుత కార్యాలయ ప్రాంగణాన్ని డాక్టర్ విజయరెడ్డి తదితరులు పరిశుభ్రం చేశారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో నగర పంచాయతీలో రోడ్లను శుభ్రం చేశారు. ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించి ప్రతిజ్ఞ చేయించి పరిసరాలలో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. మేనేజర్ నూకరాజు, ఏఈ సుధాకర్, టీపీఓ రాజేష్ బాబు, కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ప్రతి ఒక్కరి జీవితంలో స్వచ్ఛతను ఒక భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఉద్యోగులు పరిశుభ్రతా కార్యక్రమాలను సమిష్టిగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, వికాస జిల్లా మేనేజర్ జి. రమేష్, వికాస సిబ్బంది రవితేజ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌పై అవగాహన



అల్లవరంలో స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శాంతాలక్ష్మి

అల్లవరం: ఇళ్లల్లో చెత్తను తడి, పొడి చెత్తగా విభజించుకుని, సంపద కేంద్రాలకు తరలించడం ద్వారా ఎరువు తయారవుతుందని తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి అన్నారు. కొమరగిరిపట్నంలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే విధానంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బొజ్జిరాజు, ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, కార్యదర్శి చిక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు. అల్లవరంలో కార్యదర్శి రాజమోహన్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై తహసీల్దార్ నరసింహరావు అవగాహన కల్పించారు. బోడసకుర్రులో ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

పంట కాలువ పూడిక పనులు ప్రారంభం



శెట్టిపల్లి పంట కాలువలో జేసీబీతో పూడిక పనులు

సాక్షి ఇంపాక్ట్

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడి గ్రామంలో వరి చేనుకు సాగు నీరు అందకపోవడంతో పంటలు ఎండి పోతున్నాయని రైతులు చేపట్టిన ఆందోళనపై అధికారులు స్పందించారు. సాగునీటి కోసం కౌలు రైతుల ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. శెట్టిపల్లి నుంచి వన్నె చింతలపూడి వరకు కాలువలో అడ్డుగా ఉన్న చెత్తను జేసీబీతో తొలగించారు. సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి పత్రికకు కౌలు రైతులు పెయ్యాల సత్యనారాయణ, బుల జగపతి, పరమట వసంతరావు ధన్యవాదాలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు పంచాయతీ పరిధిలోని విశ్వేశ్వర అగ్రహారంలో 1,2,16 వార్డుల ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని వాటర్ ట్యాంక్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. నీటిని సరఫరా చేయకుండా పంచాయతీ సిబ్బందిని అడ్డుకొని మహిళలు ఆందోళన చేశారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మంచినీటి సమస్యపై సర్పంచ్ దాసరి అరుణాడేవిడ్ స్పందించారు. పంచాయతీ కార్యదర్శి వేగుళ్ల వెంకట రామన్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిరాజు

ఐ పోలవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో 14 మంది విద్యార్థులు విజయం సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ఐ పోలవరం మండలం మురమళ్ల క్లస్టర్ పాఠశాల సముదాయ సమావేశంలో సత్కరించారు. మురమళ్ల జెడ్పీ హైస్కూల్ నుంచి 14 మంది, భైరవపాలెం జెడ్పీ హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా భైరవపాలెం స్కూల్ ఉపాధ్యాయులు లంకే హేమ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు ఎం వీరవెంకట సత్యనారాయణమూర్తిని శనివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు ఘనంగా సత్కరించారు. 14 మంది విద్యార్థులు జాతీయ పరీక్షలో విజయం సాధించడం వెనుక ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

అంబాజీపేట: ఇరుసుమండలో ఉన్న శివాలయం ప్రాంగణంలో ఉన్న గణపతి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ఆరాధన, మార్జనలు, ప్రాశనలు, పీఠార్చన, మహాపూర్ణాహుతి, గోదృష్టి, దీక్షా విసర్జన పండిత ఆశీర్వచనాలు జరిపారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా చేశారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

మామిడికుదురు: ప్రధాన మంత్రి సురక్ష యోజన, జీవన జ్యోతి బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఫైనాన్షియల్ లిటరసీ ఎస్.విజయ్‌కుమార్, కౌన్సిలర్ జి.ప్రసాద్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా శనివారం మాకనపాలెంలో ఉపాధి హామీ కూలీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒక సారి విధిగా ఒక్క లావాదేవీ అయినా నిర్వహించాలన్నారు. లేని పక్షంలో అకౌంట్ పని చేయదన్నారు. ప్రధానమంత్రి సురక్షా యోజనలో ప్రతి ఏడాది రూ.20 చెల్లించిన 18 నుంచి 70 ఏళ్ల వారికి ప్రమాద బీమా రూ.2 లక్షలు వస్తుందన్నారు. ఈ పథకంలో అంగ వైకల్యం పొందిన వారికి కూడా సహాయం అందుతుందని చెప్పారు. జీవన జ్యోతి బీమా పథకంలో ఏడాదికి రూ.436 చెల్లించిన 18 నుంచి 50 ఏళ్ల వారికి సహజ మరణానికి కూడా రూ.2 లక్షలు సహాయం అందుతుందన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు, డ్వాక్రా మహిళలు, ఇతర కార్మికులకు బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఎస్.మూలపాలెంలో షూటింగ్ సందడి

అయినవిల్లి: ఎస్.మూలపాలెం గ్రామంలో ఇస్త్రీబండి లఘు చిత్రం నిర్మాత దుర్గాదేవ్ కథ, నిర్మత, దర్శకుడు, హీరోగా గ్రామీణ నేపథ్యంలో ప్రేమ కథా చిత్రం రూపొందిస్తున్నారు. చిత్ర షూటింగ్ వారం రోజులపాటు ఇక్కడే జరగనుంది. ఫణీంద్ర దేవరపల్లి ఈ సినిమాలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. హీరోయిన్‌గా అన్విష నటిస్తున్నారు. కెమెరామన్‌గా నాగార్జున వ్యవహరిస్తున్నారు. ఇప్పటికి 50 శాతం సినిమా పూర్తి చేశారు. ఇస్త్రీబండి, చాయ్‌బోటు, ప్రవీణ్ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ బయోపిక్‌తో 50 లఘు చిత్రాలను చిత్రీకరించానని దుర్గాదేవ్ తెలిపారు. ఇస్త్రీబండి చిత్రానికి అవార్డులు వచ్చాయని తెలిపారు. కోనసీమ పరిసర ప్రాంతాలైన అయినవిల్లి మండలంలోని ఎస్.మూలపాలెం, మాగం గ్రామాల్లో చిత్రసన్నివేశాలు చిత్రీకరిస్తున్నామన్నారు.